క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



వేలేరు : మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ఖోఖో క్రీడా పోటీల్లో జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రతిభకనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాతు అజయ్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి అండర్ 14 ఖోఖో పోటీల్లో డి.నరేష్, కళోత్సవంలో డ్రమ్స్ విభాగంలో అభిషేక్, సాయి, అంజి, సాజిద్, సాహు, అశ్వత్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మహేందర్, మ్యూజిక్ టీచర్ మానస, పీఈటీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నడికూడలో క్షుద్రపూజల కలకలం



నడికూడ : గ్రామాల్లో మూఢనమ్మకాలు రోజురోజుకి పెరిగిపోతున్నాయి. మూఢనమ్మకాల నిర్మూలనపై అధికారులు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ జనాల్లో మార్పు రావడం లేదు. మంగళవారం మండల కేంద్రంలోని పల్లెప్రకృతి వనానికి వెళ్లే దారిలో గుర్తుతెలియని వ్యక్తులు క్షుద్ర పూజలు చేసి కొబ్బరికాయ, నిమ్మకాయలను అక్కడే వదిలేసి వెళ్లిన ఆనవాళ్లు పలువురిని భయాందోళనకు గురిచేశాయి.

అక్రమంగా మొరం తరలిస్తే చర్యలు



దామెర : అనుమతులు లేకుండా అక్రమంగా మొరం తరలిస్తే చర్యలు తప్పవని ఎస్సై కొంక అశోక్ హెచ్చరించారు. దామెర క్రాస్ వద్ద మంగళవారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టినట్లు తెలిపారు. గూడెప్పాడ్ నుంచి హనుమకొండకు ఏపీ 16 టీఎస్ 1429 నంబర్ గల టిప్పర్‌లో అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. దీంతో వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు. అక్రమంగా మొరం, మట్టి తరలిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని అన్నారు.

హైస్కూల్‌లో ఘనంగా కొమురంభీమ్ జయంతి

దుగ్గొండి : మండలంలోని మహ్మదాపురం గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో కొమురం భీమ్ వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కొమురం భీమ్ చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు కాళిదాసు మాట్లాడారు. కొమురం భీమ్ జల్, జంగల్, జమీన్ నినాదంతో ఆదివాసీల హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేశారని కొనియాడారు. కొమురం భీమ్ చరిత్రను విద్యార్థులు అధ్యయనం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మన్నె బాబు, నరేందర్, ఊర్మిళ, ఇంద్రసేనారెడ్డి, రమేశ్, రామదాసు పాల్గొన్నారు.

బీసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా రజినీకాంత్

ఖానాపురం : బీసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలంలోని బుధరావుపేటకు చెందిన నందగిరి రజినీకాంత్‌ను నియమించినట్టు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ డ్యాగల శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు మండల కేంద్రంలో రజినీకాంత్‌కు నియామక పత్రాన్ని మంగళవారం అందజేశారు. అనంతరం రజినీకాంత్ మాట్లాడారు. బీసీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. బీసీలు అన్ని రంగాల్లో ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. తన ఎన్నికకు సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

బొడ్రాయికి పూజలు

ఖిలా వరంగల్: వరంగల్ శాంతినగర్ సాకరాశికుంటలోని గ్రామ దేవత బొడ్రాయి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ముస్కమల్ల సుధాకర్, కార్పొరేటర్ ముస్కమల్ల అరుణ ఆధ్వర్యంలో వేదపండితులు భాస్కరాచార్యుల నేతృత్వంలో మంగళవారం గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బొడ్రాయిని భక్తిశ్రద్ధలతో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

చిన్నతరహా పరిశ్రమతో ఉపాధి 'కల్పన'



జూట్ బ్యాగులను తయారు చేస్తున్న కార్మికులు



జూట్ బ్యాగులను తయారీ చేస్తున్న కల్పన

- ఐదుగురికి ఉపాధి కల్పిస్తున్న దాసరి కల్పన
- పలువురి ప్రశంసలు పొందుతున్న మహిళ..
- సబ్సిడీ రుణాలు ఇప్పించాలని విజ్ఞప్తి

శాయంపేట : మహిళల స్వయం సమృద్ధి కోసం చిన్నతరహా పరిశ్రమను నెలకొల్పి కొంత మందికి ఉపాధి కల్పిస్తున్నారు. మండల కేంద్రానికి చెందిన దాసరి కల్పన పర్యావరణానికి ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ప్లాస్టిక్ రహిత (జూట్) బ్యాగులు తయారు చేసే పరిశ్రమను ఏర్పాటు చేసి ఐదుగురికి ఉపాధి కల్పిస్తోంది. కుటీర పరిశ్రమలు నెలకొల్పుకుంటే సబ్సిడీ రుణాలు అందజేస్తామని డీఆర్డీఏ అధికారులు గతంలో ఆర్భాటంగా ప్రచారాలు చేశారే తప్ప ఆచరణలో అమలు చేయలేని పరిస్థితి. చిన్నతరహా పరిశ్రమ ఏర్పాటు కోసం గతంలో స్త్రీనిధి నుంచి రూ. 3 లక్షల రుణం ఇప్పించాలని దరఖాస్తు చేసుకున్నప్పటికీ అధికారులు మొండిచేయి చూపించారని, దీంతో గత్యంతరం లేక ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు తెచ్చి పరిశ్రమ నెలకొల్పి జ్యూట్ బ్యాగులు తయారు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. ప్లాస్టిక్ కవర్లు వినియోగించడం వల్ల పర్యావరణ పరిరక్షణకు భంగం వాటిల్లుతోందంటున్నారు. జూట్ బ్యాగులతో పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని అధికారులు, పర్యావరణ ప్రేమికులు చెబుతున్నారు.

స్త్రీనిధి రుణాలు అందించడం లేదు..

జూట్ బ్యాగుల తయారీ పరిశ్రమకు సబ్సిడీ రుణాలు అందకపోవడంతో ముడిసరుకుల కోసం స్త్రీనిధి నుంచి రూ. 3 లక్షల రుణాలు చెల్లించాలని నవంబర్ 17న ఐకేపీ కార్యాలయంలో అధికారులు చెప్పిన అన్ని రకాల పత్రాలతో దరఖాస్తు సమర్పించారు. కానీ ఇప్పటివరకు రుణం మంజూరు చేయలేదు. పరిశ్రమ నెలకొల్పగానే డీఆర్‌డీఏ అధికారులు, డీపీఎం అనిల్‌కుమార్ సందర్శించి ఫొటోలు, వీడియోలు తీసుకున్నారు. రుణాలు మాత్రం ఇప్పించలేదు. జ్యూట్ బ్యాగుల తయారీ పరిశ్రమ కోసం పీఎంఈజీపీకి కూడా దరఖాస్తు చేసుకున్నాను. ఈ పథకంలో 40 శాతం వర్కింగ్ క్యాపిటల్ ఉండగా 60 శాతం రుణాలు చెల్లించే వీలుంది. రూ. 10లక్షల రుణాలు మంజూరు చేసిన తమకు వెసులుబాటు కలుగుతుంది. తక్కువ వడ్డీ కావడంతో పరిశ్రమను మరింత అభివృద్ధి చేసి మహిళా కూలీలకు కూడా ఉపాధి కల్పించొచ్చు. అధికారులు స్పందించి జ్యూట్ బ్యాగ్ తయారీ కుటీర పరిశ్రమకు సబ్సిడీ రుణాలు అందించి తమకు చేయూతనివ్వాలని కోరుతున్నాను. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

\- కల్పన, మహిళ

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

- జిల్లా అడిషనల్ డీఆర్డీఓ సుధీర్

కమలాపూర్ : ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు మద్దతు ధర కల్పించి కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని హనుమకొండ జిల్లా అడిషనల్ డీఆర్డీఓ సుధీర్ అన్నారు. కమలాపూర్, ఉప్పల్ గ్రామాల్లో సెర్ప్ (ఐకేపీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ రకానికి రూ.2,320, కామన్ రకానికి రూ.2,300 చొప్పున మద్దతు ధర చెల్లిస్తోందని అన్నారు. సన్న రకాలకు రూ.500 చొప్పున బోనస్ ప్రకటించిందన్నారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, ఎప్పుడు వర్షాలు కురుస్తాయో తెలియని పరిస్థితులు ఉన్నందున రైతులు తమ ధాన్యాన్ని తడవకుండా టార్పాలిన్‌ను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. డీపీఎం ప్రకాశ్, తహసీల్దార్ సురేష్, ఎంపీడీఓ బాబు, ఎస్సై వీరభద్రరావు, ఏఓ లక్ష్మారెడ్డి, ఏపీఎం నారాయణ, మార్కెట్ యార్డ్ కార్యదర్శి రాజా, సూపర్‌వైజర్ యాకయ్య, ఏఈఓ రహీం, సీసీ మౌనిక, నిర్వాహకులు పాల్గొన్నారు.



కమలాపూర్ : కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సుధీర్

రక్తదానం ప్రాణదానంతో సమానం



ఎల్కతుర్తి : రక్తదాతలకు సర్టిఫికెట్స్ అందజేస్తున్న సీఐ రమేశ్



వేలేరు : రక్తదానం చేస్తున్న యువకులు

ఎల్కతుర్తి : రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేయడం అదృష్టంగా భావించాలని సీఐ పులి రమేశ్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కాజీపేట డివిజన్ పోలీస్‌ల ఆధ్వర్యంలో మండికొండలోని శ్రీరాజేశ్వరి గార్డెన్‌లో ఎంజీఎం రక్తనిధి సహకారంతో ఏర్పాటు చేసిన రక్తదానం శిబిరంలో ధర్మసాగర్, కాజీపేట, మడికొండ, కమలాపూర్, హసన్‌పర్తి, ఎల్కతుర్తి, ముల్కనూరు, వంగర పోలీస్‌స్టేషన్ల పరిధిలోని యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా సీఐ పులి రమేశ్ మాట్లాడుతూ.. యువకులు సేవా కార్యక్రమాల్లో పాల్పంచుకుని సమాజానికి ఉపయోగపడాలని అన్నారు. ఈ సందర్భంగా చేసిన యువకులకు పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు, పండ్లు, హెల్దీ డ్రింక్స్ అందించారు. ఎస్సై దివ్య తదితరులు ఉన్నారు.

వేలేరులో..

వేలేరు : పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మడికొండలోని ఓ ఫంక్షన్ హాల్ ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో వేలేరు ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో మండల కేంద్రానికి పలువురు యువకులు రక్తదానం చేశారు. ప్రతిఒక్కరూ రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని ఎస్సై సూచించారు. రక్తదానం చేసిన వారికి పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా సరిఫికేట్లు అందించి అభినందించారు. సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ



శాయంపేట : విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేస్తున్న మధురమ్మ

శాయంపేట / నడికూడ : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత బాలికల పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత, ఉపాధ్యాయులు శేఖర్‌బాబు, రేణుక, సుజాత, లక్ష్మీబాయి, గీత, కుమారస్వామి, రంజిత్‌కుమార్, ట్రస్ట్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే నడికూడ మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి చదువుతున్న 120 మంది విద్యార్థులకు హుజూరాబాద్‌కు చెందిన ట్రస్ట్ నిర్వాహకుడు, విశ్రాంతి గణిత ఉపాధ్యాయుడు గంగిశెట్టి జగదీశ్వర్ ఎంఈఓ హనుమంతరావుతో కలిసి పరీక్ష ప్యాడ్లను అందించారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహ్మద్ సుభాని, శారద, శ్రీనివాస్, జ్యోత్స్న, సుమలత, శ్రావణ్ కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతి, శివకుమార్, అశోక్ పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

కమలాపూర్ : మండల కేంద్రానికి చెందిన ఓ యువతి (19) అదృశ్యమైనట్లు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు పదేళ్ల క్రితం సదరు యువతి తల్లిదండ్రులు మృతి చెందగా కమలాపూర్‌లోని అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటూ ఇంటర్ పూర్తిచేసింది. యువతి ప్రస్తుతం అమ్మమ్మ ఇంటి వద్దనే ఉంటోంది. ఈనెల 14న అమ్మమ్మ తన పెద్ద కూతురు వద్దకు వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి రాగా యువతి కనిపించలేదు. చుట్టుపక్కల, తెలిసిన వారి ఇళ్లల్లో, బంధువుల ఇళ్లల్లో ఆరా తీసినా ఆచూకి లభించకపోగా ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తుంది. దీంతో యువతి అమ్మమ్మ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

సంక్షిప్తంగా

బాధిత కుటుంబానికి తోటి ఉద్యోగుల సాయం



పరకాల : తమతో కలిసి విధులు నిర్వర్తించిన తోటి ఉద్యోగి ఆకస్మికంగా మృతిచెందడంతో బాధిత కుటుంబానికి సహచరులు అండగా నిలిచారు. ఎల్కతుర్తి పీహెచ్‌సీలో హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సురేష్ 20 రోజుల క్రితం గుండెపోటుతో మృతిచెందాడు. బాధిత కుటుంబానికి తోటి ఉద్యోగులు తలోకొంత పోగుచేసి హనుమకొండలోని వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి లలితా దేవి చేతుల మీదుగా లక్ష రూపాయల విరాళాన్ని అందించారు.

ఆర్థికసాయం అందజేత..



పరకాల : రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఎం.డీ మజర్ కుటుంబాన్ని 9వ వార్డు కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణాచారి మంగళవారం పరామర్శించారు. ఈ మేరకు బియ్యంతో పాటు నిత్యవసర సరుకులు అందించారు. ముగ్గురు చిన్నారులున్న మజర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు. షహనా, దిలీప్, షఫీ, అలీ, రాజేష్, బూత్ అధ్యక్షుడు కృపేందర్‌రెడ్డి, రవి, రమేశ్, సిద్దు పాల్గొన్నారు.

విద్యుత్‌వైరు తెగిపడి కాడెద్దు మృతి



ఎల్కతుర్తి : విద్యుత్‌వైరు తెగిపడి కాడెద్దు మృతిచెందింది. ఈ సంఘటన భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్‌లో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వేల్పుల రవీందర్ కాడెడ్లను ముల్కనూరు శివారులోని తన వ్యవసాయ క్షేత్రంలో సోమవారం సాయంత్రం కట్టేశాడు. మంగళవారం ఉదయం రైతు తన వ్యవసాయ భూమి వద్దకు వెళ్లి చూడగా ఎద్దు మృతి చెంది ఉంది. రాత్రి సమయంలో విద్యుత్ హైటెన్షన్ వైరు తెగి ఎద్దుపై పడడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు రైతు తెలిపాడు. పక్కనే ఉన్న మరో ఎద్దుకు ప్రమాదం తప్పిందన్నాడు. కాగా ఎద్దు చనిపోయిన విషయాన్ని గమనించి సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆఫ్ చేసి విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించినట్లు తెలిపాడు. తన జీవన ఉపాధి కాడెడ్లతోనేనని, అధికారులు న్యాయం చేసి ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

ఏడీఈ రాజుకు సన్మానం

కమలాపూర్ : హనుమకొండ నయీంనగర్ ఎన్పీడీసీఎల్ అడిషనల్ డివిజనల్ ఇంజినీర్‌గా బాధ్యతలు చేపట్టిన కమలాపూర్‌కు చెందిన ఏడీఈ కొండమీది రాజును అతడితో కలిసి పదోతరగతి చదువుకున్న మిత్రులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం శాలువాతో ఘనంగా సన్మానించారు. భీమదేవరపల్లి ఏడీఈగా పని చేసిన రాజు.. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా హనుమకొండ నయీంనగర్‌కు బదిలీ అయ్యారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు దేవేందర్, మల్లారెడ్డి, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సేల్స్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ మేనేజర్ నాగరాజు, అటవీ శాఖ ఉద్యోగి రమేష్‌బాబు, న్యాయవాది మహేందర్, జర్నలిస్టులు, మిత్రులు రవి, ఇస్మాయిల్, కిశోర్‌కుమార్, మల్లేష్, కనుకుంట్ల వంశీకృష్ణ పాల్గొన్నారు.

తైబజార్ ప్రారంభం

శాయంపేట : మండలంలోని సూర్యనాయక్‌తండా గ్రామానికి చెందిన గ్రామ యూత్ అధ్యక్షుడు గుగులోతు (తీన్మార్) జై కృషితో ఎట్టకేలకు మంగళవారం తైబజార్ ప్రారంభమైంది. సూర్యనాయక్‌తండా, గంగిరేణిగూడెం, నిజాంపల్లి గ్రామ మాజీ సర్పంచ్‌లు భూక్య రమేష్, శానం మంజుల పరమేశ్వర్, బాపురెడ్డి, మాజీ ఎంపీటీసీ రెడ్డినాయక్ హాజరయ్యారు. అయితే తైబర్ లేని కారణంగా గ్రామస్తులు నిత్యవసర సరుకులు, కూరగాయలు కొనుగోలు చేసేందుకు పరిసర ప్రాంతాలకు వెళ్లేవారని, దీంతో యూత్ సభ్యుల సహకారంతో స్థానిక క్రీడా మైదానంలో తైబజార్ ఏర్పాటు చేసినట్లు స్థానికులు తెలిపారు. వచ్చేవారం నుంచి బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు తై బజార్ కొనసాగుతుందని తెలిపారు. గ్రామాల్లోని ప్రజలకు అందుబాటులో సంత ఉందని, సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా వారు కోరారు.

అసైన్డ్ భూమి పట్టాదారులకు నోటీసులు

ఎల్కతుర్తి : మండల కేంద్రంలోని 73 సర్వే నంబర్‌లో గల అసైన్డ్ భూమికి పట్టాలు పొంది సాగు చేయకుండా ఇసుక అక్రమ రవాణాదారులకు లీజుకు ఇచ్చారనే ఆరోపణల నేపథ్యంలో ఆ భూమి పట్టాదారులకు మంగళవారం స్థానిక తహసీల్దార్ జగత్‌సింగ్ నోటీసులు జారీ చేశారు. రెవెన్యూ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. 73 సర్వే నంబర్‌లో 11.27 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిని గతంలో నిరుపేదలకు సాగు చేసుకునేందుకు అసైన్డ్ పట్టా సర్టిఫికేట్స్‌ను అప్పటి ప్రభుత్వం పంపిణీ చేసింది. కాగా గ్రామ శివారులో గల వాగు కుంట భూమి పొందిన లబ్ధిదారుడు సంవత్సరం లోపు వ్యవసాయ భూమిగా మార్చి కాస్తులోకి తీసుకోవాలని, లేనిపక్షంలో ఆ భూమిని అసైన్డ్ లబ్ధిదారుడు మాత్రమే అనుభవించాలని, అలా చేయని పక్షంలో అసైన్డ్ పట్టా సర్టిఫికేట్స్ రద్దు చేసి ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకునే అధికారం ఉంటుందని తెలిపారు. భూమి పొందిన అసైన్డ్ లబ్ధిదారులు భూమిని సాగు చేయకుండా ఇసుక అక్రమ రవాణాదారులకు లీజుకు ఇచ్చి అందులోని మట్టిని తవ్వి, తవ్విన మట్టిలో నుంచి ఫిల్టర్ చేసిన ఇసుకను రవాణా చేస్తూ అక్రమణకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయని తెలిపారు. ఈ క్రమంలో రెవెన్యూ అధికారులు విచారణ జరుపగా, సదురు భూమిలో అక్రమ ఇసుక రవాణా జరుగుతుందని తేలిందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన లబ్ధిదారులు అసైన్డ్ భూమిని తిరిగి ప్రభుత్వం నిబంధనల ప్రకారం ఎందుకు స్వాధీన పరుచుకోకూడదో వారం రోజుల్లోగా సంజాయిషీ ఇవ్వాలని, లేనియెడల నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని నోటీసుల్లో స్పష్టం చేశారు.

మాదిగలను మోసం చేస్తున్న ప్రభుత్వం

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి శంకర్‌మాదిగ



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ శంకర్‌మాదిగ

పరకాల : ఎస్సీ వర్గీకరణ కాకపోయినా ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా ఉద్యోగ నియామకాల్లో మాదిగలకు న్యాయం చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటను మరిచి మాదిగలకు అన్యాయం చేస్తుందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి శంకర్‌మాదిగ మండిపడ్డారు. మండలంలోని కామారెడ్డిపల్లి గ్రామంలో జరిగిన ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఉద్యోగ నియామకాల్లో న్యాయం చేస్తానని హామీ ఇచ్చి రెండు నెలలు గడుస్తున్నా సీఎం రేవంత్‌రెడ్డి పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నారని, డిసెంబర్ వరకు గ్రూపు-1, గ్రూపు-2తో లక్ష ఉద్యోగాలు భర్తీ చేస్తూ మాదిగలను మోసం చేయాలనే పన్నాగం పన్నుతున్నట్లు ఆరోపించారు. ఈనెల 26వ తేదీన మంద కృష్ణమాదిగ హాజరుకానున్న ఉమ్మడి వరంగల్ జిల్లా ధర్మయుద్ధ మహాసభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు ఐలయ్య, రాజు, భద్రయ్య, నాగయ్య, దిలీప్, రఘుపతి, యశ్వంత్, వినయ్, రాకేష్ పాల్గొన్నారు.

ఓటరు నమోదు చేపట్టిన పీఆర్టీయూ నాయకులు



ఓటరు నమోదు పత్రం అందజేస్తున్న శ్రీపాల్‌రెడ్డి, పీఆర్టీయూ నాయకులు

ధర్మసాగర్ : నల్గొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, నారాయణగిరి, పెద్దపెండ్యాల, ఎల్కుర్తి గ్రామాల్లోని పాఠశాలల్లో మంగళవారం పీఆర్టీయూ ఆధ్వర్యంలో ఓటరు నమోదును చేపట్టారు. పీఆర్టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి, ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మండల తిరుపతిరెడ్డి, ఫలిత శ్రీహరి, ప్రధానోపాధ్యాయులు మురళి, రాంధన్, రాజేందర్, సంఘం రాష్ట్ర సహ అధ్యక్షుడు రఘోత్తం రెడ్డి, బండ రమేష్, శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, మాధవి, మండల అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, జాన్‌సింగ్, జిల్లా ఉపాధ్యక్షుడు అంజయ్య, మహిళా ఉపాధ్యక్షురాలు సరస్వతి, మండల మహిళా ఉపాధ్యక్షురాలు తులసి, కార్యదర్శి యమునశ్రీ, వేలేరు మండల అధ్యక్షుడు భానుప్రసాద్‌రెడ్డి, కస్తూర్బా ఎస్ఓ మాధవి పాల్గొన్నారు.

'విశ్వకర్మ యోజన'ను వినియోగించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రతాప్

నర్సంపేట : విశ్వకర్మ యోజన పథకాన్ని అర్హులు వినియోగించుకోవాలని బీజేపీ నాయకుడు కంభంపాటి ప్రతాప్ కోరారు. జమ్మికుంటలో శిక్షణ పూర్తి చేసుకున్న వారితో మంగళవారం ఆయన మాట్లాడారు. లబ్ధిదారులకు ఆరు రోజుల పాటు రోజుకు రూ.500 చొప్పున ఇస్తూ శిక్షణ అందజేస్తున్నట్టు తెలిపారు. శిక్షణ అనంతరం వృత్తికి సంబంధించి రూ.15 వేల విలువైన కిట్ ఉచితంగా అందించడతోపాటు శిక్షణ పూర్తి చేసుకున్న వారికి రూ.3 లక్షల రుణం ఇస్తారని చెప్పారు. నియోజకవర్గంలోని 18 ఉపకులాల చేతివృత్తుల ప్రజలు అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. విశ్వకర్మలు ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రచార కార్యదర్శి బాల్నె జగన్, జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శి పంజాల రాము, వళ్లాజి నరేందర్, ముత్యాల సాంబయ్య, సామల ప్రవీణ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల ఫోరం ఉపాధ్యక్షుడిగా సంతోశ్

ఖానాపురం : తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడిగా మండలంలోని మంగళవారిపేటకు చెందిన సతీశ్‌యాదవ్ ఎన్నికయ్యారు. ఈ మేరకు సతీశ్‌కు రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ నియామకపత్రాన్ని మంగళవారం అందజేశారు. ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలని ఈ సందర్భంగా సతీశ్ కోరారు.

బాధిత కుటుంబానికి బీమా చెక్కు అందజేత

చెన్నారావుపేట : మండలంలోని తిమ్మరాయినిపహాడ్‌కు చెందిన రైతు దాసరి బాలస్వామి ఇటీవల మృతి చెందగా అతడి భార్య రత్నమేరీకి మంజూరైన రూ.3 లక్షల జీవిత బీమా చెక్కును ఎస్‌బీఐ మేనేజర్ మోహన్‌కాంత్ బ్యాంక్ కార్యాలయంలో మంగళవారం అందజేశారు. అనంతరం మేనేజర్ మాట్లాడారు. బాలస్వామి బ్యాంకులో ఖాతా కలిగి ఇటీవల పంట రుణాన్ని తీసుకున్నాడని చెప్పారు. లైఫ్ ఇన్సూరెన్స్ కూడా చేయించుకున్న క్రమంలో ఆయన మృతి చెందగా బాధిత కుటుంబానికి రూ.3 లక్షలు మంజూరైనట్టు తెలిపారు. బ్యాంకు ఖాతాదారులు, రైతులు జీవిత బీమా చేయించుకుంటే కుటుంబాలకు భద్రత లభిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ కట్ట స్వామి, క్యాష్ ఆఫీసర్ నవనీత్‌చారి, సిబ్బంది సదిరం రాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్‌మెన్‌కు ఘన సన్మానం

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని మహేశ్వరం, లక్నెపల్లి, రామవరం, రాజపల్లి, స్వామినాయక్‌తండా, రాములునాయక్‌తండా గ్రామాలకు విద్యుత్ లైన్‌మెన్‌గా విధులు నిర్వహించిన బానోత్ మోహన్‌నాయక్ నర్సంపేటకు సబ్‌స్టేషన్ ఆపరేటర్‌గా బదిలీ అయిన సందర్భంగా బీసీ పవర్ రాష్ట్ర కమిటీ సభ్యులు, మహేశ్వరం గ్రామ రైతులు మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా బీసీ పవర్ రాష్ట్ర అధికార ప్రతినిధి మచ్చిక రాజుగౌడ్ మాట్లాడారు. మోహన్‌నాయక్ విధి నిర్వహణలో మెరుగైన సేవలు అందించారని అభినందించారు. ఎక్కడ విధులు నిర్వర్తించినా మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. ప్రజలకు సేవలందించే అవకాశం రావడం గొప్ప వరంగా భావించాలని అన్నారు. ఈ కార్యక్రమంలోబీసీ నాయకులు మిర్యాల కుమారస్వామి, కంజర్ల అమిన్, పులుగుల సంజీవరెడ్డి, బోళ్ల భాస్కర్, మేక శ్రీకాంత్, నల్ల రాజు, మహేశ్వర యూత్ క్లబ్ నాయకుడు బొల్లెపల్లి రమేశ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.